టెన్త్ పరీక్షల తత్కాల్ ఫీజు చెల్లింపు గడువు 22

- ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కృష్ణారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ ఏడాది మార్చి 21 నుంచి జరిగే పదోతరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తత్కాల్ పద్ధతిలో ఫీజు చెల్లించేందుకు గడువు ఈనెల 22వ తేదీ వరకు ఉన్నది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలస్య రుసుం రూ.వెయ్యితో ఈనెల 22 వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశముందని తెలిపారు. రెగ్యులర్‌తోపాటు ఫెయిలైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర సమాచారం కోసం www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

31న ఐటిసి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు

- బరిలోకి ఐదు యూనియన్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేపరు ఉత్పత్తి రంగంలో అగ్రగామిగా నిలిచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటిసి పిఎస్‌పిడి కర్మాగారంలో ఈ నెల 31న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరగనున్నాయి. ఖమ్మంలోని డిసిఎల్ వి విజయభాస్కర్‌రెడ్డి నేతృత్వంలో ఎన్నికల తేదీని ప్రకటించారు. పోటీలో నిలిచిన ఐదు యూనియన్లకు ఎన్నికల గుర్తులను కేటాయించారు. దీంతో ఐటిసి కర్మాగారంలో ఎన్నికల సందడి జోరందుకుంది. 13వ వేతన ఒప్పందం నేపథ్యంలో జరుగుతున్న ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకం.

ఐటిసిలో 14 కార్మిక సంఘాలు ఉన్నాయి. ఇందులో ఈసారి ఎన్నికల్లో ఐదు కార్మిక సంఘాలు బరిలో నిలిచాయి. ఇప్పటికే పోటీలో నిలిచిన ఆయా యూనియన్ల నేతలు ఓటు హక్కు కలిగిన కార్మికులను దఫాలుగా కలిసి తమకే ఓటు వేయాలని అభ్యర్థించారు. వాస్తవానికి పండుగకు ముందుగానే ఎన్నికలు జరగాల్సి ఉండగా కొన్ని ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో ఈ నెల 31న ఎన్నికలు నిర్వహించటానికి అధికారులు నిర్ణయించారు. ఎన్నికల బరిలో నిలిచిన ఐదు కార్మిక సంఘాలకు ఎన్నికల అధికారి డీసీఎల్ విజయభాస్కర్ రెడ్డి గుర్తులు కేటాయించారు. భద్రాచలం పేపర్ బోర్డు లిమిటెడ్ వర్కర్స్ యూనియన్ (ఇ-229) యూనియన్‌కు గడియారం గుర్తు, భద్రాచలం పేపర్ బోర్డు మజ్దూర్ సంఘం (ఇ-693) యూనియన్‌కు దీపం గుర్తు, ఐటిసి భద్రాచలం పేపర్ బోర్డ్స్ ఎంప్లాయీస్ యూనియన్ (ఇ-232)కు త్రాసు గుర్తు, అదేవిధంగా ఐటిసి పిఎస్‌పిడి భద్రాచలం శ్రామిక శక్తి ఎంప్లాయీస్ బదిలీల యూనియన్ (ఎ/208)కు బాణం గుర్తు, అలాగే తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్ (ఇ-2490)కు కాగడ గుర్తులను కేటాయించారు. కర్మాగారంలోని మిగతా సంఘాలు.. పోటీచేస్తున్న ఆయా యూనియన్లకు మద్దతు ప్రకటించాయి.

నుమాయిష్‌లో ఎల్‌ఐసి స్టాల్ ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్

నాంపల్లిలో జరుగుతున్న ఆల్ ఇండియా ఇండస్ట్రీయల్ ఎగ్జిబిషన్‌లో ప్రభుత్వ రంగంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసి) తన స్టాల్ ఏర్పాటు చేసింది. నుమాయిష్‌లోని ఈ స్టాల్‌ను బుధవారం ఎల్‌ఐసి జోనల్ మేనేజర్ పునీత్ కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. ఇక్కడ పలు పాలసీలకు సంబంధించిన వివరాలను ఖాతాదారులు పొందవచ్చన్నారు. అదే విధంగా ఇటీవల మహిళలు ఎల్‌ఐసి ఏజెంట్లుగా మారడం కోసం ఉద్దేశించి ఆవిష్కరించిన బీమా శక్తి సమాచారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ సెక్రటరీ బి సురేందర్ రెడ్డి, ఎల్‌ఐసి అధికారులు ఆర్ సతీష్ బాబు, ఉతుప్ జోసెఫ్, సరస్వతి గోపకుమార్, జిబివి రామయ్య, ప్రమోద్ కుమార్ సాహు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, బనగానపల్లి.
O.S. No. 11 /2023
BATTULA THIMMA REDDY,
S/O Late B. Venkata Reddy,
R/o Meerapuram(V), Banaganapalle(M),
Nandyal (Dt). ...పిటీషనర్/ వాది
VERSUS
SUDDAMALLA NARAYANA REDDY ,
S/O Late S. Subba Reddy, Aged about 76 Years,
R/O W.Kothapalle (V), Dornipadu (M),
Nandyal (Dt).
Now R/O Railway Quarters No. 608,
Lancer Lines,Opp.Appolo Hospital,
Secundrabad (Town), Telamngana (St).
...రెస్పాండెంట్/ ప్రతివాది
కోర్టువారి ఉత్తర్వుల మేరకు సమను
పై దావలో వాది, ప్రతివాది పై తన ప్రోనోట్ మొత్తం రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా దాఖలు చేసి ఉన్నారు. మీకు సమను ఎన్ని మార్లు పంపిన మీకు ముట్టనందున పై కోర్టువారు పై కేసును మీహాజరు కొరకై 07-03-2025 వ తేదీకి వాయిద వేసిఉన్నారు. పై దావాకు సంబంధించి, మీకు ఎటువంటి అభ్యంతరములు ఉన్నయెడల 07-03-2025 వ తేదీ ఉదయం 10-30 గంటలకు, స్వయముగా గానీ, మీ వకీలు ద్వారా కానీ పై కోర్టు వారి ఎదుట హజరై, మీ అక్షేపణలను తెలుపుకొనవలెను.లేనియెడల పై కోర్టువారు మీకు వ్యతిరేకముగా దావా తీర్మానించెదరు అని తెలియజేయడము అయినది.
వాయిద : 07-03-2025.
శ్రీ T. మాధవ రెడ్డి,
శ్రీ T.R. జగన్నాథ రెడ్డి,
వాదివరం న్యాయవాదులు,
బనగానపల్లె (T&M),
Nandyal (Dt)
చరవాణి : 9440553641,
9440844090.

సంక్రాంతికి 'స్పెషల్' బాదుడు

- 50 శాతం అదనపు ఛార్జీల మోత
- ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు స్పెషల్ వసూళ్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పండగ పేర ఛార్జీల భారం మోపేందుకు ఆర్‌టిసి సిద్ధమైంది. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు పూర్తిచేసింది. ప్రయాణికులను సురక్షితంగా వారి వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా 6432 ప్రత్యేక బస్సులను నడపాలని ఆర్‌టిసి సంస్థ నిర్ణయించింది. ప్రత్యేక బస్సుల్లో మాత్రం 50శాతం అదనపు చార్జీలు వసూలు చేయనున్నట్టు వెల్లడించింది. అందులో 557 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్నిచ్చింది. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు కేటాయించిన బస్సుల్లో ఉచిత సర్వీసు కొనసాగుతుందని తెలిపింది.

ఈనెల ఏడు నుంచే స్పెషల్ బస్సులను ప్రారంభించిన సంస్థ 22వ తేదీ వరకు హైదరాబాద్ కేంద్రంగా తెలంగాణ జిల్లాలు, ప్రధాన నగరాలు, ఇతర రాష్ట్రాలకు, ప్రాంతాలకు నడపుతోంది. పేరుకు స్పెషల్ బస్సులని సంబరపడ్డా.. సాధారణ రోజుల్లో టికెట్ ధరపై అదనంగా 50 శాతం చెల్లించాలని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. పండగలొచ్చినప్పుడల్లా 'స్పెషల్' ప్రయాణంలో జనం జేబులకు చిల్లులు తప్పడం లేదు. ఈ సమయాల్లో రెగ్యులర్ సర్వీసుల సంఖ్యను తగ్గిస్తూనే ఆన్‌లైన్ బుకింగ్‌లోనూ సర్వీసు ఛార్జీల పేరుతో బాదుతుండటంపై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. 2003లో ఇచ్చిన జీవో నెంబర్ 16 ప్రకారం కిలోమీటర్‌కు రూ.1.50 మాత్రమే అదనంగా వసూలు చేస్తున్నామని ఆర్‌టిసి చెబుతోంది.

రాష్ట్ర వ్యాప్తంగా 6432 స్పెషల్ బస్సులకు ప్లాన్

ఈ నెల ఏడు నుంచి 13వరకు హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులు, తిరిగి ఈనెల 16 నుంచి 22 వరకు తిరిగి ఆయా ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే బస్సులు అదనంగా ఆర్‌టిసి సంస్థ తిప్పుతుంది. ఇందుకుగాను రాష్ట్ర వ్యాప్తంగా 6432 ప్రత్యేక బస్సులు నడపబోతున్నట్టు తెలిపింది. వీటిలో కేవలం 557 సర్వీసులకు మాత్రమే రిజర్వేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఉదాహరణకు కరీంనగర్ రీజియన్ పరిధిలో పరిశీలిస్తే జెబిఎస్ నుంచి కరీంనగర్‌కు ఈనెల 7 నుంచి 13వ తేదీవరకు 770 బస్సులు, తిరిగి కరీంనగర్ నుంచి జెబిఎస్‌కు ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకు 970 అదనపు బస్సులను ఏర్పాటు చేసింది. అలాగే, మెదక్ రీజియన్ పరిధిలోని ఎనిమిది డిపోల నుంచి 295 బస్సులను ప్రత్యేక సర్వీసులుగా నడపనున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురం, గుంటూరు, విజయవాడ, కాకినాడ, కందుకూరు, నెల్లూరు, ఒంగోలు వంటి పట్టణాలకు ప్రత్యేకంగా బస్సులు నడుపుతారు. అన్ని డిపోలకు చెందిన బస్సులు జెబిఎస్, సికింద్రాబాద్, బాలానగర్, లింగంపల్లి, పటాన్‌చెరు సెంటర్ల నుంచి ఆయా డిపోల పరిధిలోని రూట్లకు కూడా ప్రత్యేక సర్వీసుల్ని నడపనున్నారు.

50 శాతం అదనపు ఛార్జీలు

సంక్రాంతి పండగ సందర్భంగా ప్రత్యేక బస్సుల్లో వసూలు చేయాల్సిన బస్ ఛార్జీల పట్టికను ఆర్‌టిసి సంస్థ ఆయా రీజియన్ అధికారులకు అందజేసింది. ప్రస్తుతం ఉన్న ఛార్జీలకు అదనంగా 50 శాతం వసూలు చేయాలని నిర్ణయించారు. సాధారణ రోజుల్లో రూ.100 ఉన్న ఛార్జీని రూ.150కి పెంచి వసూలు చేస్తారు. రూ.50 ఛార్జీని రూ.75 చొప్పున వసూలు చేస్తారు. పది రోజుల వరకు ప్రత్యేక బస్సులను నడపడం ద్వారా మెదక్ రీజియన్‌లో సుమారు రూ.20 కోట్ల మేర ఆదాయాన్ని రాబట్టాలని అధికారులు యోచిస్తున్నారు. అలాగే, సాధారణ రోజుల్లో కరీంనగర్ నుంచి (172కిలోమీటర్ల దూరం) జెబిఎస్‌కు సూపర్‌లగ్జరీ బస్సుల్లో చార్జీ ఒక వ్యక్తికి రూ.340గా ఉంటుంది. అదే స్పెషల్ బస్సులో ప్రయాణిస్తే కిలోమీటర్‌కు రూ.1.50చొప్పున రూ.250వరకు అదనంగా చెల్లించాల్సిందే. అయితే, మహాలక్ష్మి స్కీం కింద మహిళలకు ఉచిత ప్రయాణమందించే ఎక్స్‌ప్రెస్ సర్వీసులు తగ్గాయి. వాటిస్థానంలో డీలక్స్, ఎలక్ట్రికల్ బస్సుల సంఖ్య పెరిగింది.

బస్సులు పెంచకుండా భారాలు సరికాదు: జి.సాయిలు, సిఐటియు జిల్లా కార్యదర్శి, సంగారెడ్డి

ప్రజా రవాణా వ్యవస్థ ఆర్‌టిసి ఎంతో కీలకమైంది. ఇప్పటికే ఉచిత ప్రయాణం వల్ల బస్సులు సరిపడాలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పండగ పేర పది రోజుల పాటు ప్రత్యేక సర్వీసులు నడిపితే మరింత ఇబ్బంది తప్పదు. బస్సులు పెంచకుండా ఉన్న వాటిని పండగ పేర తిప్పడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడతారు. అదనపు ఛార్జీల భారాన్ని కూడా తగ్గించాలి. ప్రత్యేక బస్సులనేవి ప్రయాణికుల సౌకర్యార్థం తప్ప అదనపు డబ్బులు వసూలు చేసేందుకు వెసులుబాటు కాదు.

రద్దీని బట్టి బస్సుల్ని నడుపుతాం: ప్రభులత, ఆర్‌ఎం, మెదక్ రీజియన్

సంక్రాంతి పండగ సందర్భంగా రీజియన్ పరిధిలో ప్రత్యేక బస్సుల్ని నడిపేందుకు ఏర్పాట్లు చేశాం. ప్రయాణికుల రద్దీ, అవసరాన్ని బట్టి బస్ సర్వీసులను పొడిగిస్తాం. పది రోజుల వరకు పండగ రద్దీ ఉండే అవకాశముంది. ప్రత్యేక బస్సుల్లో అదనపు ఛార్జీలు ఉంటాయి. స్థానిక అవసరాల కోసం కూడా కొన్ని బస్సులు నడుస్తాయి.

ఇప్పట్లో కొత్త నోటిఫికేషన్లు లేవు

- టిజిపిఎస్‌సి చైర్మన్ బుర్రా వెంకటేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మార్చి 31లోపు వివిధ శాఖల్లో ఖాళీ పోస్టుల జాబితాను అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) చైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. కొత్త నోటిఫికేషన్లు ఇప్పట్లో లేవని స్పష్టం చేశారు. ఏప్రిల్ తర్వాతే కొత్త నోటిఫికేషన్లను విడుదల చేస్తామని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈనెల 11న బెంగుళూరులో జాతీయస్థాయిలో అన్ని పిఎస్‌సిల సమావేశం జరుగుతుందని వివరించారు. యుపిఎస్‌సిలో ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. ఆ తర్వాత అవసరమనుకుంటే పరీక్ష నిర్వహిస్తారని చెప్పారు. స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్‌ఎస్‌సీ)లో ఇంటర్వ్యూ లేదనీ, పరీక్ష ఆధారంగానే నియామకాలు జరుగుతున్నాయని అన్నారు. ఢిల్లీ పర్యటన తర్వాత పరీక్షల నిర్వహణతోపాటు ఫలితాలను వేగంగా విడుదల చేయడంపై దృష్టి పెట్టామని వివరించారు. ఏండ్లకు ఏండ్లు అభ్యర్థుల ఎదురుచూపులకు చెక్ పెడతామని అన్నారు. గ్రూప్-3 ప్రాథమిక కీని విడుదల చేశామని చెప్పారు. శుక్రవారం గ్రూప్-2 కీని విడుదల చేస్తామన్నారు. అభ్యర్థుల్లో టిజిపిఎస్‌సి పట్ల విశ్వాసాన్ని పెంపొందిస్తామని అన్నారు. ఆలస్యం కావడానికి ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. యుపిఎస్‌సి ఎప్పుడూ కీ ఇవ్వదని గుర్తు చేశారు. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలుంటే ఏడాదిలోపు నియామకాల ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు. ఒక పరీక్ష మాత్రమే ఉంటే ఆర్నెళ్ల నుంచి తొమ్మిది నెలల వ్యవధిలో పూర్తి చేస్తామన్నారు.

ఏకీకృత సర్వీస్ నిబంధనలు రూపొందించాలి

- పాఠశాలల పర్యవేక్షణ వ్యవస్థ లేక సంక్షోభంలో విద్యారంగం
- టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏకీకృత సర్వీస్ నిబంధనలను రూపొందించి అమలు చేయాలని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండల పరిధిలోని చిరునోముల గ్రామంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పూర్వ ప్రాథమిక పాఠశాల తరగతులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరినప్పటికీ, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా పూర్వ ప్రాథమిక పాఠశాల తరగతులను ప్రారంభించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కెజి, యుకెజిని ఇంగ్లీష్ మీడియంలో ప్రారంభించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ తరగతులను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఐదు సంవత్సరాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండాలని, ఆరో సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రభుత్వం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రవి

విధించిన నిబంధనల వల్ల ప్రాథమిక పాఠశాలలకు నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పర్యవేక్షణ వ్యవస్థ లేకపోవటం వల్ల విద్యావ్యవస్థ కుంటుపడుతోందని, సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా 33 డిఇఒ పోస్టులను, ఎంఇఒ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏకీకృత సర్వీస్‌కు ఏమైనా ఆటంకాలు ఉంటే ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలన్నారు. రెండు సంవత్సరాల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులు దాచుకున్న (జిపిఎఫ్) డబ్బులు కూడా అవసరానికి ఉపయోగపడడం లేదని తెలిపారు. మార్చి 2000 నుంచి ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు బిల్లులు చెల్లించడం లేదన్నారు. ఈ నెలలో.. వచ్చే నెలలో అంటూ ప్రభుత్వం కాలం గడుపుతోందని విమర్శించారు. డిఎ, పిఆర్‌సి పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలి

ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి గెలిపించాలని చావ రవి ఉపాధ్యాయులను కోరారు. అలుగుబెల్లి నర్సిరెడ్డి తన ఆరేండ్ల కాలంలో అనేక సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర నిర్వహించారన్నారు. రూ. నాలుగు కోట్లను సిఎం సహాయనిధి నుంచి మంజూరు చేయించి పేద ప్రజలకు అందజేశారన్నారు. మరోసారి అవకాశం కల్పిస్తే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో కృషి చేస్తారన్నారు.

ఎసిబి విచారణకు అర్విందు కుమార్ హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫార్ములా ఈ-రేసు కేసులో ఐఎఎస్ అధికారి అర్విందు కుమార్ ఎసిబి విచారణకు బుధవారం హాజరయ్యారు. ఈ కేసులో ఆయన నిందితుడిగా ఉన్నారు. నిధుల బదలాయింపులో ఆయన కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి. తన పరిధిలో ఉన్న హెచ్‌ఎండిఎ నుంచి ఎఫ్‌ఇఒ (ఫార్ములా-ఈ ఆపరేషన్స్)కు హెచ్‌ఎండిఎ చీఫ్ ఎగ్జిక్యూటివ్ బిఎల్‌ఎన్ రెడ్డి ద్వారా నిధులు బదిలీ చేసినట్లు సమాచారం. అప్పటి మంత్రి కెటిఆర్ ఆదేశాలతోనే నిధులు బదిలీ చేసినట్లు గతంలో అర్విందు కుమార్ ప్రభుత్వానికి వివరణ ఇచ్చారు. ఆయన వాంగ్మూలాన్ని ఎసిబి అధికారులు రికార్డు చేశారు.

ఇడిముందుకు బిఎల్‌ఎన్ రెడ్డి

మరోవైపు ఫార్ములా-ఈ రేసు కేసులో బిఎల్‌ఎన్ రెడ్డి బుధవారం ఇడి విచారణకు హాజరయ్యారు. రేసు జరిగినప్పుడు ఆయన చీఫ్ ఇంజినీర్‌గా ఉన్నారు.

రూ.45.71 కోట్లు విదేశీ సంస్థకు బదిలీ చేసిన వ్యవహారంలో ఇడి దర్యాప్తు చేస్తోంది. ఎసిబి కేసు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసింది.

పాటలు మనుషులను మారుస్తాయి : సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాటలు మనుషులను మారుస్తాయనీ, కఠిన మనసులను కరిగిస్తాయని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) చెప్పారు. మంచి సందేశంతో సినీ నటుడు అలీ, డైరెక్టర్ రమణారెడ్డి పాటను చిత్రీకరించడం అభినందనీయమని కొనియాడారు. వారిద్దరూ నిర్మించిన 'నిన్ను నన్ను కన్న ఆడది రా...చిన్నచూపు చూడకన్నది రా' పాటను బుధవారం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో సీతక్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతక్కను అలీ కుటుంబ సభ్యులు సత్కరించారు.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, బనగానపల్లి.
O.S.No.10/2023.
BATTULA THIMMA REDDY,
S/O Late B. Venkata Reddy,
R/o Meerapuram(V), Banaganapalle(M),
Nandyal (Dt). ...పిటీషనర్/ వాది
VERSUS
SUDDAMALLA NARAYANA REDDY ,
S/O Late S. Subba Reddy, Aged about 76 Years,
R/O W.Kothapalle (V), Dornipadu (M),
Nandyal (Dt).
Now R/O Railway Quarters No. 608,
Lancer Lines,Opp.Appolo Hospital,
Secundrabad (Town), Telamngana (St).
...రెస్పాండెంట్/ ప్రతివాది
కోర్టువారి ఉత్తర్వుల మేరకు సమను
పై దావలో వాది, ప్రతివాది పై తన ప్రోనోట్ మొత్తం రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా దాఖలు చేసిఉన్నారు. మీకు సమను ఎన్ని మార్లు పంపిన మీకు ముట్టనందున పై కోర్టువారు పై కేసును మీహాజరు కొరకై 07-03-2025 వ తేదీకి వాయిద వేసి ఉన్నారు. పై దావాకు సంబంధించి, మీకు ఎటువంటి అభ్యంతరములు ఉన్నయెడల 07-03-2025 వ తేదీ ఉదయం 10-30 గంటలకు, స్వయముగా గానీ, మీ వకీలు ద్వారా కానీ పై కోర్టు వారి ఎదుట హజరై, మీ అక్షేపణలను తెలుపుకొనవలెను.లేనియెడల పై కోర్టువారు మీకు వ్యతిరేకముగా దావా తీర్మానించెదరు అని తెలియజేయడము అయినది.
వాయిద : 07-03-2025.
శ్రీ T. మాధవ రెడ్డి,
శ్రీ T.R. జగన్నాథ రెడ్డి,
వాదివరం న్యాయవాదులు,
బనగానపల్లె (T&M),
Nandyal (Dt)
చరవాణి : 9440553641,
9440844090.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, బనగానపల్లి.
O.S. No. 2 /2023.
BATTULA THIMMA REDDY,
S/O Late B. Venkata Reddy,
R/o Meerapuram(V), Banaganapalle(M),
Nandyal (Dt). ...పిటీషనర్/ వాది
VERSUS
SUDDAMALLA NARAYANA REDDY ,
S/O Late S. Subba Reddy, Aged about 76 Years,
R/O W.Kothapalle (V), Dornipadu (M),
Nandyal (Dt).
Now R/O Railway Quarters No. 608,
Lancer Lines,Opp.Appolo Hospital,
Secundrabad (Town), Telamngana (St).
...రెస్పాండెంట్/ ప్రతివాది
కోర్టువారి ఉత్తర్వుల మేరకు సమను
పై దావలో వాది, ప్రతివాది పై తన ప్రోనోట్ మొత్తం రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా దాఖలు చేసి ఉన్నారు. మీకు సమను ఎన్ని మార్లు పంపిన మీకు ముట్టనందున పై కోర్టువారు పై కేసును మీహాజరు కొరకై 07-03-2025 వ తేదీకి వాయిద వేసి ఉన్నారు. పై దావాకు సంబంధించి, మీకు ఎటువంటి అభ్యంతరములు ఉన్నయెడల 07-03-2025 వ తేదీ ఉదయం 10-30 గంటలకు, స్వయముగా గానీ, మీ వకీలు ద్వారా కానీ పై కోర్టు వారి ఎదుట హజరై, మీ అక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల పై కోర్టువారు మీకు వ్యతిరేకముగా దావా తీర్మానించెదరు అని తెలియజేయడము అయినది.
వాయిద : 07-03-2025.
శ్రీ T. మాధవ రెడ్డి,
శ్రీ T.R. జగన్నాథ రెడ్డి,
వాదివరం న్యాయవాదులు,
బనగానపల్లె (T&M),
Nandyal (Dt)
చరవాణి : 9440553641,
9440844090.

అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు విస్తరణ పనులు

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు విస్తరణ పనులను వారం పది రోజుల్లో ప్రారంభించి ఏడాదిలోపు పూర్తి చేసేందుకు కృషి చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని చేవెళ్ల పిసిఎస్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి తన సొంత నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన కో ఆపరేటివ్ సొసైటీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం మండలంలోని ముడిమ్యాల స్టేజీ వద్ద ముడిమ్యాల నుంచి మేడిపల్లి వరకు రూ.24 కోట్లతో రోడ్డు పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు 46.5 కిలోమీటర్ రోడ్డు విస్తరణ పనులను 10 రోజులకు ఒకసారి పనులను, అదేవిధంగా ఆర్ అండ్‌బీ రోడ్లను పర్యవేక్షిస్తామని తెలిపారు. డబ్బుపోతే సంపాదించుకోవచ్చు కానీ మనిషి ప్రాణం పోతే తిరిగిరాదని, ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని దృష్టిలో పెట్టుకుని వెంటనే రోడ్డు పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన అభివృద్ధే ఇప్పటికీ ఉందని, ఆయన ఈ ప్రాంతాన్ని సెంటిమెంట్‌గా తీసుకుని పనిచేశారన్నారు. ఎన్ని కోట్లు ఖర్చుపెట్టయినా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుంటామని చెప్పారు.

భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, స్పీకర్ గడ్డం, మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య

అనంతరం స్పీకర్ మాట్లాడుతూ.. వికారాబాద్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ. 150 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సుపరిచితులని, అందుకే వికారాబాద్ నియోజకవర్గం నుంచి వెళ్తున్న నాలుగు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించి రూ. 10 వేల కోట్లతో అభివృద్ధి చేయాలని ఆయన్ని కలిసి వినతిపత్రం ఇచ్చినట్టు చెప్పారు. రంగారెడ్డి జిల్లాలో గత ప్రభుత్వం పదేండ్ల పాలనలో ఎక్కడా రోడ్ల అభివృద్ధి జరగలేదన్నారు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిర్మించిన ఔటర్ రింగ్ రోడ్డుతోనే రంగారెడ్డి జిల్లాలో అభివృద్ధి పరుగులు మొదలయ్యాయని తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయం నిర్మాణంతో ఈ ప్రాంతంలోని భూములకు మంచి ధరలు వచ్చాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం.. అభివృద్ధి, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారనీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పరీక్షలు నిర్వహించి నియామక ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, బలవంత్ రెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీమ్ భరత్, డీసీసీ మాజీ అధ్యక్షులు పడాల వెంకటస్వామి, కాంగ్రెస్ మత్స్యకారుల విభాగం రంగారెడ్డి చైర్మెన్ నారాయణపురం మహేందర్ ముదిరాజ్, పీఎసీఎస్ చైర్మెన్ గోనె ప్రతాప్ రెడ్డి, మాజీ సర్పంచులు కేసారం శ్రీనివాస్ యాదవ్, గోపాల్‌రెడ్డి, భీమయ్య, జంహగీర్ తదితరులు పాల్గొన్నారు.

బిగ్‌సిలో సంక్రాంతి వినూత్న ఆఫర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ మొబైల్ రిటైల్ చెయిన్ బిగ్‌సి సంక్రాంతి పండుగ సందర్భంగా ఆకర్షణీయ ఆఫర్లను అందిస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. ప్రతీ మొబైల్ కొనుగోలుపై రూ.10,000 వరకు మొబైల్ ప్రొటెక్షతో పాటు రూ.5,999 విలువ గల స్మార్ట్ వాచ్ లేదా రూ.1,799 విలువ గల ఇయర్ బడ్స్‌ను ఉచితంగా అందిస్తున్నామని బిగ్ సి వ్యవస్థాపకులు, సిఎండి ఎం బాలు చౌదరి తెలిపారు. కొత్తగా ఆవిష్కరించిన ఒప్పో రెనో 13 మొబైల్స్ తమ అన్ని స్టోర్లలో లభిస్తుందన్నారు. ఈ స్మార్ట్‌ఫోన్‌పై రూ.7,999 విలువ గల స్విస్ మిలిటరీ స్పీకర్‌తో పాటు ఏడాది పాటు మొబైల్ ప్రొటెక్షన్, రూ.5వేల వరకు ఇన్‌స్టాంట్ క్యాష్‌బ్యాక్ అందిస్తున్నామన్నారు. అదే విధంగా ప్రతీ మొబైల్ కొనుగోలుపై రూ.15,000 వరకు తక్షణ క్యాష్‌బ్యాక్ అందుకోవచ్చన్నారు. బ్రాండెడ్ పరికరాలపై 51 శాతం వరకు డిస్కౌంట్ కల్పిస్తున్నామన్నారు. ఎలాంటి వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండానే కొనుగోలు చేసే ఆకర్షణీయమైన సదుపాయం అందుబాటులో ఉందన్నారు. ఐఫోన్, వివో, ఒప్పో, వన్‌ప్లస్, రియల్‌మీ, ఎంఐ ఫోన్ల కొనుగోలుపై రూ.5వేల వరకు డిస్కౌంట్ పొందవచ్చన్నారు. మొబైల్, స్మార్ట్‌టివి, ల్యాప్‌టాప్, ఎయిర్ కండీషనర్లను తక్కువ ధరలకు లభిస్తాయని.. ఈ సదావకాశాన్ని వినియోగదారులు ఉపయోగించుకోవాలన్నారు.

Union Bank of India
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ,
4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్,
ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఏ.పి.-520001,
Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

ఋణగ్రహీత(లు) : 1) **త్రీ సీజన్స్ ఆక్వాటెక్ ప్రైవేట్ లిమిటెడ్,** ఫ్లాట్ నెం. 201ఎ, గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్, ఖాజాగూడ, మణికొండ, నానక్‌రామ్‌గూడ, గచ్చిబౌలి,హైదరాబాద్-500032. 2) **శ్రీ సాయి రాజ్ జంపన,** డి.నెం. ఎ-2-293/82/ఎ/594, ఫ్లాట్ నెం.302, ప్లాట్ నెం. 594, రోడ్ నెం. 29, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033. 3) **శ్రీమతి ఉషా గాంధి జంపన,** డి.నెం. ఎ-2-293/82/ఎ/594, ఫ్లాట్ నెం.302, ప్లాట్ నెం. 594, రోడ్ నెం. 29, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033. 4) **శ్రీ సాయి రాజ్ జంపన,** మెస్సర్స్ త్రీ సీజన్స్ ఆక్వాటెక్ ప్రైవేట్ లిమిటెడ్, డి.నెం.2-62-8, పెద్దిరెడ్డి వారి వీధి, శాంతినగర్, కాకినాడ-533003. 5) **మెస్సర్స్ కెవిఆర్ అసోసియేట్స్, తరుపున మేనేజింగ్ పార్టనర్ శ్రీ సాయిరాజ్ జంపన,** ఆర్‌ఎస్.నెం.135/2, డి.నెం.1-414, ప్రస్తుతం డి.నెం.1-385, దుప్పలపూడి గ్రామం, పీరాయి రామచంద్రపురం పంచాయితీ పరిధి, అనపర్తి మండలం, తూర్పుగోదావరి జిల్లా, 6) **శ్రీ సాయి రాజ్ జంపన,** ఎస్.ఎఫ్.నెం. 2/4,5,3/1,2,3, పోతుకూరు గ్రామం, ఐనవల్లి మండలం, తూర్పుగోదావరి జిల్లా-533577, 7) **శ్రీమతి ఉషా గాంధి జంపన,** ఎస్.ఎఫ్.నెం. 2/4,5,3/1,2,3, పోతుకూరు గ్రామం, ఐనవల్లి మండలం, తూర్పుగోదావరి జిల్లా-533577, 8) **శ్రీమతి ఉషా గాంధి జంపన,** మెస్సర్స్ త్రీ సీజన్స్ అక్వాటెక్ ప్రైవేట్ లిమిటెడ్, డి.నెం.2-62-8, పెద్దిరెడ్డి వారి వీధి, శాంతినగర్, కాకినాడ-533003. 9) **మెస్సర్స్ కెవిఆర్ అసోసియేట్స్, తరుపున మేనేజింగ్ పార్టనర్ శ్రీ సాయి రాజ్ జంపన,** డి.నెం.59ఎ-9-7/2, సాయి బాబా గుడి వీధి, ఆర్‌టిసి కాలనీ, విజయవాడ.

విషయం : బ్యాంక్ వారికి మెస్సర్స్ త్రీ సీజన్స్ అక్వాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఋణపడిన బకాయి వసూలు చేసుకొను నిమిత్తమై సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద ఆస్తి విక్రయము గురించి.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001 వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 **సెక్షన్ 13(2)** క్రింద **ది.06.04.2021న డిమాండ్ నోటీసు** ద్వారా మిమ్ములను మాకు చెల్లించవలసిన బకాయి మొత్తము నిర్దేశించిన గడువులోపు చెల్లించమని కోరినను, బకాయి మొత్తం నిర్దేశించిన గడువులోపు చెల్లించుటలో మీరు విఫలమైనారు. ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.07.08.2021న** సదరు చట్టంలోని సెక్షన్ 13(4) లోని 6 / 8వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారములతో అధీకృత అధికారి **లాంఛనాత్మక స్వాధీనం** చేసుకోవడమైనది. ఆస్తిని **లాంఛనాత్మక స్వాధీనం** చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తమును చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు అందిన తేది నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా పబ్లిక్ ఇ-వేలం నిర్వహించడం ద్వారా దిగువ పేర్కొన ఆస్తిని విక్రయించడం అనివార్యమైనది. ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం తేదీ మరియు సమయం ఇ-వేలం నిర్వహించబడే సర్వీస్ ప్రొవైడర్ యొక్క వివరములు విడిగా జారీచేయబడుతుంది.

కాబట్టి, మీరు బ్యాంకుకి చెల్లించాల్సిన మొత్తాన్నా విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు బ్యాంక్ వెచ్చించిన ఖర్చులతో కలిపి చెల్లించినట్లయితే, ఆస్తి అమ్మకంపై తదుపరి చర్య తీసుకోబడదు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం తనఖాఆస్తులను విడిపించుకొను హక్కు కలదు.

షెడ్యూల్ ఆస్తి

తనఖావుంచబడిన స్థిరాస్తి వివరములు దిగువ పేర్కొనబడినవి : ఆస్తి 1: తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి మండలం, పీరాయి రామచంద్రాపురం గ్రామపంచాయతీ, దుప్పలపూడి గ్రామము, అసెస్‌మెంట్ నెం.412, ఆర్.యస్.నెం.135/2, డి.నెం.1-414 నందు **మెస్సర్స్ కె.వి.ఆర్. అసోసియేట్స్ (రిజిస్టర్డ్ నెం.5/2010 ప్రకారం) తరపున మేనేజింగ్ పార్టనర్ శ్రీ జంపన సాయిరాజ్‌కు** చెందిన ఎ.4.52 సెంట్లు లేదా 21876.80 చ॥గ॥ల విస్తీర్ణముగల భూమి మరియు అందులోని రెండు ఆర్‌సిసి షెడ్లు కలిగిన గోడౌన్ బిల్డింగ్‌లకు సంబంధించిన యావదాస్తి. **స్థలమునకు హద్దులు: తూర్పు:** అనపర్తి నుండి రాజానగరంకు వెళ్ళు రోడ్డు, **దక్షిణం:** చిటికెన నాగమణి, మట్టె అనంతలక్ష్మి, కొవ్వూరి రామకృష్ణారెడ్డి మరియు ఇతరుల యొక్క భూమి, **పడమర:** నల్లమిల్లి వనమారెడ్డి మరియు ఇతరుల యొక్క భూమి, **ఉత్తరం:** తిరుపతి వెంకటేశ్వర రైస్‌మిల్ కొంత భాగము మరియు నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి మరియు ఇతరుల యొక్క భూమి కొంత భాగము.

అక్షాంశ-రేఖాంశములు :16.963104,81.941980.

స్థలం : విజయవాడ
తేది : 03-01-2025
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

ఉద్రిక్తతల నడుమ 'చిన్న కాళేశ్వరం'

- ఇద్దరు బాధిత మహిళల ఆత్మహత్యాయత్నం
- భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం ఎలికేశ్వరం గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులు నష్టపరిహారం ఇచ్చాకే పనులు కొనసాగించాలని మూడు రోజులుగా బాధితులు పనులను అడ్డగిస్తున్నారు. అయినా అధికార యంత్రాంగం.. పోలీసుల పహారా మధ్య పనులు చేపడుతున్నది. ఈ క్రమంలో ఓ బాధిత మహిళా రైతు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా పోలీసులు అడ్డుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం కూడా తమ భూములు లాక్కుంటున్నారని పురుగుల మందు తాగి జెసిబి కిందపడి రైతులు పనులు అడ్డగించే ప్రయత్నం చేశారు. రైతులను వారి పొలాల వద్దకైనా రానివ్వకుండా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. అన్యాయంగా తమ భూములను లాక్కుంటున్నారని పురుగుల మందు తాగి, కెనాల్ గోతిలో పడుకొని రైతులు నిరసన వ్యక్తం చేశారు. చిన్న కాళేశ్వరం గ్రావిటీ కెనాల్ కోసం గతంలో చేసిన సర్వే కాకుండా ఇప్పుడు కొత్తగా సర్వే చేసి, తమ భూములను లాక్కుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆందోళన తెలుపుతున్న రైతులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి : సిపిఎం

చిన్న కాళేశ్వరంలో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పోలం రాజేందర్ డిమాండ్ చేశారు. భూమి కోల్పోతున్న మహిళా రైతు పురుగు మందు తాగి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెను పరామర్శించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు రైతులకు న్యాయం చేయాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు తక్షణమే న్యాయం చేయాలని, ఎలికేశ్వరం రైతులపై పోలీసుల దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. వాళ్లకి కావాల్సిన నష్టపరిహారం ఇప్పిస్తే స్వతంత్రంగా భూములు ఇస్తామని రైతులు చెబుతున్నారని అన్నారు. 167 సర్వే నెంబర్‌లో ఉన్న భూమిని పోరంబోకు అంటూ ప్రభుత్వ అధికారులు చెబుతున్నారని తెలిపారు. 2012కు ముందు వాళ్లకు పట్టాలు ఉన్నాయని, గత 40 నుంచి 50 ఏళ్ల వరకు వాళ్ళు కాస్తులో ఉన్నారని అన్నారు. సాగు చేస్తున్న భూములను ఇప్పుడు వచ్చి అధికారులు తమ భూములంటూ దౌర్జన్యానికి దిగడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అరెస్టు చేస్తూ పనులను కొనసాగిస్తున్నారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ చేసి, భూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం ఇచ్చి భూములను స్వాధీనం చేసుకొని అభివృద్ధి చేస్తే ఎవరూ వ్యతిరేకించరని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన అంటూనే ఆర్ల ప్రసాద్, రాళ్ల బండి కోమలపై పోలీసులతో దాడి చేపించి మందు తాగిందని అపోహ సృష్టించారని అన్నారు. తక్షణమే ఎలికేశ్వరం రైతులకు నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆత్మకూరు శ్రీకాంత్, నాయకులు కుమ్మరి రాజు, బొడ్డు స్మరణ, ఆతుకూరి శ్రీధర్, బాధిత రైతులు పాల్గొన్నారు.

బాలుడ్ని పరీక్షిస్తున్న వైద్యుడు

సోమాలియా బాలుడి ప్రాణాలను కాపాడిన మెడికవర్ వైద్య బృందం

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

తీవ్రస్థాయిలో అన్నవాహిక కుంచించుకుపోయి బాధపడుతున్న సోమాలియాకు చెందిన 13 ఏళ్ల బాలుడిని మెడి కవర్ వైద్య బృందం కాపాడింది. ద్వారా వయసుకు తగినటు 50 కేజీల బరువు ఉండాల్సి ఉండగా కేవలం 19 కేజీల బరువు మాత్రమే వున్న ఆ బాలుడికి కనీసం లాలాజలం కూడా మింగలేని స్థితిలో ఆస్పత్రికి వచ్చారు.

సీనియర్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ మధుమోహన్ రెడ్డి నేతృత్వంలో చికిత్స ప్రారంభించారు. రెట్రోస్టెర్నల్ విధానం ద్వారా పెద్దప్రేగు మార్పిడి చేసారు. దీనిలో భాగంగా గొంతు దగ్గర అన్నవాహిక సరిచేయటంతో పాటుగా ఉదరం లోపల డిస్టల్ కోలో-గ్యాస్ట్రిక్ అనస్టోమోసిస్, కోలిక్ అనస్టోమోసిస్ చికిత్స చేశారు. కాలేయ వైద్య నిపుణులు, గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య బృందం సంయుక్తంగా బాలుడికి చికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడాడు.

మనువాదుల మూకదాడులను ఉపేక్షించేది లేదు

- గురువుతో విద్యార్థి కాళ్లు మొక్కించడం హిందూ ధర్మమా?
- మతోన్మాదులను కఠినంగా శిక్షించాలి : స్కైలాబ్ బాబు
- దళిత టీచర్ అయినందుకే నాపై దాడి : బాధిత హెడ్మాస్టర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మనువాదుల మూక దాడులను ఉపేక్షించేది లేదని, తుక్కుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భక్తి ముసుగులో ప్రభుత్వ ప్రధానోపాధ్యాయునిపై దౌర్జన్యం చేశారని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు అన్నారు. దళిత హెడ్మాస్టర్‌పై దాడి చేసిన, ఆయనతో విద్యార్థి కాళ్లు మొక్కించిన వారిని వీడియో ఫుటేజ్ ఆధారంగా గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం కెవిపిఎస్ రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఘటనపై డిజిపికి ఫిర్యాదు చేయాలని, అన్ని జిల్లా కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని, విద్యార్థి సంఘాలు జెఎసిగా ఏర్పడి పాఠశాలను సందర్శించాలని, ఉపాధ్యాయ సంఘాలు నల్ల బ్యాడ్జీలతో నిరసనలు తెలపాలని సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. పాఠశాల హెడ్మాస్టర్‌తో విద్యార్థి కాళ్లు మొక్కించడం కూడా హిందూ ధర్మమేనా అని ప్రశ్నించారు. ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుని విధులకు ఆటంకపరిచి హత్యాయత్నానికి ప్రయత్నించారని, కులం పేరుతో దూషించారని మూడు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపి కూడా స్పందించాలని కోరారు. సంఘటన జరిగి రెండు వారాలైనా రాజకీయ పార్టీలు నేటికీ ఖండించకపోవడం శోచనీయమన్నారు. జిల్లా కలెక్టర్ పాఠశాలను సందర్శించాలని, దళిత మంత్రులుగా ఉన్న మల్లు భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ ఈ ఘటనపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. బాధిత ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు కంబాలపల్లి రాములు మాట్లాడుతూ.. తనపై మూకుమ్మడిగా దౌర్జన్యం చేసి చొక్కా, బనియన్ చింపేశారని చెప్పారు. తలపై, వీపుపై పిడుగుద్దులు గుద్దుతూ జైశ్రీరామ్.. స్వామియే శరణమయ్యప్ప అంటూ దౌర్జన్యం చేశారంటూ భావోద్వేగానికి గురయ్యారు. తన చేత విద్యార్థి కాళ్లు మొక్కించడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నానని తెలిపారు. తనకు జరిగిన ఈ అవమానం ఉపాధ్యాయ లోకంతోపాటు తెలంగాణ సమాజానికి జరిగినట్టేనని అన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. సమావేశంలో టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం వెంకటప్ప, ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు టి నాగరాజు, పుట్ట లక్ష్మణ్ మహేష్, విజయ్, సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, డివైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, బేడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కడమంచి రాంబాబు, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర నాయకులు జె చక్రవర్తి, తెలంగాణ ప్రజా సంస్కృతిక మండలి నాయకులు మేకల వీరన్న యాదవ్, గడ్డం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పేదల జోలికెళ్లదు

- ఆ పేరు చెప్పి భయపెట్టేందుకు ప్రయత్నిస్తే నమ్మొద్దు
- హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్
- తుర్కయంజాల్ చెరువు పరిశీలన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైడ్రా పేదల జోలికెళ్లదని, కొందరు కావాలని హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని కమిషనర్ ఎవి రంగనాథ్ తెలిపారు. ఎవరైనా హైడ్రా పేరు చెప్పి భయపట్టేందుకు ప్రయత్నిస్తే నమ్మొద్దన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ చెరువును హైడ్రా కమిషనర్ పరిశీలించారు. చెరువు తూములు మూసేసి అలుగు పెంచడంతో చెరువు పైభాగంలో పంటపొలాలు, ఇళ్లు నీట మునుగుతున్నాయని స్థానికులు ఈ నెల 6న హైడ్రా నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కమిషనర్ నేరుగా క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పరిశీలించారు. తుర్కయంజాల్ చెరువు ఎఫ్‌టిఎల్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించామని కమిషనర్ తెలిపారు. ఇరిగేషన్ ఇంజనీర్లు, రెవెన్యూ అధికారులతో చర్చిస్తామన్నారు. అంతేకాకుండా ఐఐటి, బిట్స్ పిలాని, జెఎన్‌టియు విద్యాలయాల ఇంజినీరింగ్ నిపుణులతో కూడా అధ్యయనం చేయిస్తామని తెలిపారు. ఎన్‌ఆర్‌ఎస్‌సి ఇమేజీలు, గ్రామాలకు చెందిన మ్యాప్స్‌తో పరిశీలించి రెండు మూడు నెలల్లో శాస్త్రీయ పద్ధతుల్లో చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారిస్తామన్నారు. నగరంలో కొన్ని చెరువులు మాయమైతే, మరికొన్ని చెరువుల ఎఫ్‌టిఎల్ పరిధి పెరుగుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వాటిని పరిశీలించి నిష్పక్షపాతంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

చెరువులోకి మురుగు నీరు వచ్చి చేరుతోందని, ఆ నీరు కిందకు పోవడం లేదని తుర్కయంజాల్ చెరువుపై భాగంలో ఉన్న ఆదిత్య నగర్ నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. స్థానికంగా పరిశీలించిన కమిషనర్ ఆదిత్య నగర్‌లో ఇంటి స్థలాలు కొన్నప్పుడు ఈ స్థలంలో నీరు నిలువలేదని తెలిపారన్నారు. చెరువుకు సంబంధించిన అన్ని వివరాలూ తెలుసుకొని శాస్త్రీయ పద్ధతిలో ఎఫ్‌టీఎల్‌ను నిర్ణయిస్తామని కమిషనర్ చెప్పారు. ఇక్కడున్న నివాసితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామానికి చెందిన మ్యాప్స్, రెవెన్యూ రికార్డులతోపాటు ఎన్‌ఆర్‌సీఎస్ ఇమేజీలను పరిశీలించి అన్ని శాఖల అధికారులతో సంప్రదించి త్వరలో చెరువు ఎఫ్‌టిఎల్ నిర్ధారిస్తామని కమిషనర్ తెలిపారు. పేదలను హైడ్రా ఇబ్బంది పెట్టదని, హైడ్రా పేరు చెప్పి మిమ్ములను భయపెట్టేందుకు ప్రయత్నిస్తే నమ్మొద్దని కమిషనర్ స్పష్టం చేశారు. తుర్కయంజాల్ చెరువు విస్తరణ 495 ఎకరాల్లో ఉందని, మొత్తం విస్తీర్ణం 522 ఎకరాలని ఇలా పలు లెక్కలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

తుర్కయంజాల్ చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్

యక్షగాన జానపద కళలకు ప్రత్యేక అకాడమీ ఏర్పడాలి

- తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ నుంచి వేరుచేసి ప్రత్యేకమైన జానపద వృత్తి కళాకారుల అకాడమీని వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం టిపిఎస్‌కె హాల్‌లో.. బుధవారం చిందు, బేడ, బుడగ యక్షగాన కళాకారుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో యక్షగాన కళాకారులు రెండు లక్షల మంది ఉన్నారని తెలిపారు. వాళ్లకు పట్టెడన్నం, పాత వస్త్రం, దుఃఖం, అప్పులు, ఆవేదనలు తప్ప తెలంగాణ సర్కార్ ఇచ్చింది ఏమీ లేదన్నారు. రవీంద్ర భారతి శిష్ట కళలకు వేదికగా ఉంది తప్ప గ్రామీణ కళాకారుల కోసం లేదన్నారు. తెలంగాణ జానపద సాహిత్యం కనుమరుగైపోతుంటే.. తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ రవీంద్ర భారతి సన్మానాలకు సత్కారాలకు మాత్రమే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు వేల సంవత్సరాల చరిత్ర కలిగిన యక్షగానం కాలగర్భంలో కలిసిపోక ముందే చర్యలు తీసుకోవాలని, దీన్ని భావితరాలకు అందజేయాలంటే డిజిటల్ చేసి ఆ కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. కళారూపాల్ని ఆధునికరించాలన్నారు.

తెలంగాణ జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండూరి భాస్కర్ మాట్లాడుతూ.. జానపద వృత్తి కళాకారులకు గుర్తింపు కార్డులు, వృద్ధాప్య పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు తక్షణమే ఇవ్వాలని కోరారు. వృత్తి కళాకారులకు, జానపద కళాకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ.500 కోట్లు విడుదల చేయాలని, కళాకారుల వాయిద్య పరికరాలను ప్రభుత్వం సబ్సిడీతో అందజేయాలని డిమాండ్ చేశారు. జనవరి 30న రాష్ట్ర జానపద వృత్తి కళాకారుల ధర్నా నిర్వహించి మంత్రికి మెమోరాండం సమర్పించాలని కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఎస్.జనార్దన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో లక్ష్మమ్మ, శారదాదేవి, తూర్పటి నర్సింహులు, కె అంజయ్య, ఎస్ నర్సింహులు, అయోధ్య, కె శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

మందు బాబులకు తిప్పలు

- రాష్ట్రానికి కింగ్ ఫిషర్ బీర్ల సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

మందు బాబులకు యునైటెడ్ బేవరేజెస్ కంపెనీ (యుబిఎల్) షాకిచ్చింది. తమకు చెల్లించాల్సిన బకాయిలు పేరుకు పోవడంతో తెలంగాణకు కింగ్ ఫిషర్ బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం బీర్ల ధరలను పెంచినా, తయారీదారులకు చెల్లించే బేస్ ధరను పెంచకపోవడంతో భారీ నష్టాలు వస్తున్నాయని యుబిఎల్ తెలిపింది. రాష్ట్రం నుంచి తమ కంపెనీకి రూ. 900 కోట్లు రావాల్సి ఉందని పేర్కొంది. ఈ జాప్యం కూడా కంపెనీ నష్టాలకు కారణమైందని వెల్లడించింది. ఈ విషయాన్ని సెబీకి లేఖ ద్వారా తెలిపింది. కింగ్ ఫిషర్, కింగ్ ఫిషర్ స్ట్రాంగ్, కింగ్ ఫిషర్ అల్ట్రా, కింగ్ ఫిషర్ అల్ట్రా మ్యాక్స్‌తో పాటు ఇతర బ్రాండ్లను నిలిపివేస్తున్నట్లు యుబిఎల్ లేఖలో పేర్కొంది. తెలంగాణలో బీర్ల అమ్మకాల్లో కింగ్ ఫిషర్ బ్రాండ్ల వాటా దాదాపు 60 నుంచి 70 శాతం ఉంటుందని గణాంకాలు చెబుతున్నాయి.

సిసిఐ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి

- ఎక్సైజ్ శాఖ డైరెక్టర్

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర ప్రభుత్వ ఏర్పాటు చేసిన కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నిబంధనలను బెవరీస్ కార్పోరేషన్ అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ చెవ్వూరు హరికిరణ్ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని అబ్కారీ భవన్‌లో సీసీఐ నిబంధనలపై స్టేట్ రీసోర్స్ పర్సన్ ఆర్.సి.కుమార్ ఉద్యోగులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరికరణ్ మాట్లాడుతూ కంపెనీల మధ్య పోటీ ఉంటేనే వినియోగదారులకు మేలు జరుగుతుందనీ, సిండికేట్‌గా మారితే వారికి నష్టం జరుగుతుందని అన్నారు. అనంతరం జరిగిన కోర్టు కేసుల రివ్యూపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కోర్టులిచ్చిన నోటీసులకు వెంటనే స్పందించి గడువులోగా సమాధానమివ్వాలని సూచించారు. కోర్టులో వేసే రిట్లు, పిల్స్‌పై కంటెంట్ ఆఫ్ కోర్టు కేసులపై సీరియస్‌గా ఉండాలని అన్నారు. ఆయా శాఖల ఎస్ఓలు ఎప్పటికపుడు కేసులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ అజయ్‌రావు ఎక్సైజ్ జాయింట్ కమిషనర్లు ఖురేషి, కేపీబీ శాస్త్రీ, సురేష్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో బ్రిగేడ్ గేట్‌వే ప్రాజెక్టు

- 10 ఎకరాల్లో రూ.4500 కోట్ల పెట్టుబడులు
- ది వాల్డ్ ట్రేడ్ సెంటర్ ఏర్పాటు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

దిగ్గజ రియాల్టీ కంపెనీ బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ రూ.4500 కోట్ల పెట్టుబడులతో హైదరాబాద్‌లో కొత్త ప్రాజెక్టును చేపడుతున్నట్లు ప్రకటించింది. కోకపేట్‌లోని నియోపోలిస్ సమీపంలో పదెకరాల్లో 'బ్రిగేడ్ గేట్‌వే' పేరుతో నివాస, వాణిజ్య అవసరాలను తీర్చేలా నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమర్ మైసోర్ వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే నగరంలో రెండు ప్రాజెక్టులను పూర్తి చేశామని.. తాజా బ్రిగేడ్ గేట్‌వేలో నివాసాలు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లను అందుబాటులోకి తేనునామన్నారు.

"45 లక్షల చదరపు అగుడుల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టును అందుబాటులోకి తెస్తున్నాము. ఇందులో 25 లక్షల చదరపు అడుగుల్లో లగ్జరీ నివాసాలను అందుబాటులోకి రానున్నాయి. భూమి, నిర్మాణం కోసం రూ.4,500 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాము" అని అమర్ మైసోర్ తెలిపారు. ఈ నిధులను ఈక్విటీ, ఫైనాన్స్, కొనుగోలుదారుల నుంచి సమీకరించనున్నామన్నారు. 600 ఫ్లాట్లను అందుబాటులోకి తేనున్నామని.. 3,4,5 పడక గదుల శ్రేణిలోని వీటి ధరలను రూ.4 కోట్లు - రూ.12 కోట్ల మధ్య ఉంటాయన్నారు. నివాస టవర్లు 212 మీటర్ల ఎత్తులో ఉంటాయని తెలిపారు. అదే విధంగా మరో 20 చదరపు అడుగుల విస్తీర్ణంలో వాణిజ్య టవర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో 6 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మాల్, 10 లక్షల చ.అ ల్లో ఆఫీసు స్పేస్, 300 కీస్ ఇంటర్నేషనల్ హోటల్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆఫీసు స్పేస్‌ను వాల్డ్ ట్రేడ్ సెంటర్ బ్రాండ్‌పై ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాణిజ్య స్పేస్‌ను విక్రయించడం లేదని కార్పొరేట్లకు అద్దెకు మాత్రమే ఇవ్వనున్నామని బ్రిగేడ్ హాస్పిటాలిటీ డైరెక్టర్ వినీత్ వర్మ పేర్కొన్నారు. బ్రిగేడ్ గేట్‌వేతో 10వేల మందికి ఉపాధి లభించనుందన్నారు. ఈ సంస్థ కొచ్చీ, బెంగళూరు, మైసూర్, చెన్నయ్, హైదరాబాద్, గిఫ్ట్ సిటీలో కార్యకలాపాలను కలిగి ఉంది.

సృజనాత్మక నైపుణ్యాల ప్రదర్శనకు వేదిక 'మెట్రో'

- ముఖ్యమైన స్టేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు : ఎండి ఎన్‌విఎస్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెట్రో ప్రయాణికులు సృజనాత్మక నైపుణ్యాలను ప్రదర్శించుకునేందుకు వేదికగా మెట్రో స్టేషన్లు నిలవనున్నాయని హెచ్‌ఎంఆర్‌ఎల్, హెచ్‌ఏఎంఎల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి వెల్లడించారు. బుధవారం నుంచి ఈనెల 10వరకు ముఖ్యమైన మెట్రో స్టేషన్లలో సంక్రాంతి సంబురాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎల్‌అండ్‌టి మెట్రో రైల్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన 'మీ టైం ఆన్ మై మెట్రో' అనే ప్రత్యేక వినూత్న కార్యక్రమాన్ని ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌లో బుధవారం ఎల్‌అండ్‌టి మెట్రో రైల్ సిఎండి కెవిబిరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్మార్ట్‌కార్డు, వీడియోలు, ప్రచార కార్యక్రమాలను ప్రతిబింబించేలా రూపొందించిన మెట్రో రైలును జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మెట్రో ఎండి మాట్లాడుతూ.. మెట్రో అంటే కేవలం కాంక్రీట్, గోడల నిర్మాణాలతో కూడిన ఒక రవాణా వ్యవస్థ మాత్రమే కాదని, ఇది హైదరాబాద్ జనం జీవితాలతో ముడిపడి ఉన్న ఆత్మ వంటిదని చెప్పారు. ప్రయాణికుల్లో దాగివున్న వివిధ కళా, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లోని అభిరుచిని ప్రదర్శించుకునే గొప్ప అవకాశాన్ని కల్పిస్తున్నట్టు వివరించారు. హైదరాబాద్‌ని ఒక అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలన్న సిఎం రేవంత్ రెడ్డి సూచనలను దృష్టిలో పెట్టుకొని మెట్రో ద్వారా మరింత అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కొన్ని ముఖ్యమైన స్టేషన్ల జంక్షన్లను, విశాలమైన స్థలాలను ప్రత్యేక హబ్‌లుగా, అంతర్జాతీయ కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

కొత్త కారిడార్లకు మెగా జంక్షన్

మెట్రో ఫేజ్-2 పార్ట్-'బి'లోని ప్రతిపాదిత జెబిఎస్-శామీర్ పేట్(22 కి.మీ), ప్యారడైజ్ - మేడ్చల్ (23 కి.మీ) మార్గాలకు ఉమ్మడిగా ఒక మెగా జంక్షన్‌ను ఏర్పాటు చేయాలన్న సీఎం సూచనల మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మెట్రో ఎండి తెలిపారు. సెకండ్ ఫేజ్ 'ఏ' అయిదు కారిడార్లకు సంబంధించి ఇప్పటికే కేంద్రానికి పంపిన డిపిఆర్‌లను త్వరలో ఆమోదింపజేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. వాటి అనుమతులు రాగానే ఆ పనులు త్వరితగతిన ప్రారంభిస్తామన్నారు. ఈలోగా పాతనగరంలో భూసేకరణ చేస్తూనే, రోడ్డు విస్తరణకు, మెట్రో నిర్మాణానికి కూల్చివేతల పనులు త్వరలోనే చేపట్టనున్నట్టు తెలిపారు.

అదనపు కోచ్‌ల కొనుగోలుకు ప్రయత్నాలు..: ఎల్‌అండ్‌టి సిఎండి కెవిబి రెడ్డి

మెట్రో రైళ్లలో పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు కొనుగోలు చేయడానికి తగు ఏర్పాట్లు చేస్తున్నామని ఎల్‌అండ్‌టి మెట్రో రైల్ సిఎండి కెవిబి రెడ్డి తెలిపారు. ఆర్డర్ ఇచ్చిన 18 నెలల్లో కొత్త కోచ్‌లు వస్తాయన్నారు. ప్రయాణికులు ఇంకా క్రమశిక్షణను అలవర్చుకుంటే రద్దీ సమస్య చాలా వరకు తగ్గుతుందని చెప్పారు.

సరైన వైద్యం అందకే మా తండ్రి చనిపోయాడు

- శ్రీసాయి నర్సింగ్ హోమ్ ఎదుట మృతుని కుమారుల ఆందోళన
- ఆస్పత్రికి తాళం వేసి నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆస్పత్రిలో సమయానికి సరియైన వైద్యం అందించకపోవడంతోనే తమ తండ్రి చనిపోయారని ఆరోపిస్తూ హాస్పిటల్ ఎదుట బాధితులు ఆందోళన చేపట్టిన సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు గ్రామానికి చెందిన బోయిని బిక్షపతి యాదవ్ ఈ నెల 3న అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి పక్కనే ఉన్న శ్రీసాయి నర్సింగ్ హోమ్‌లో చికిత్స చేయించుకోవడానికి వెళ్లారు. బిక్షపతికి వైద్యులు ఒకేసారి ఏడేనిమిది గోళీలు వేసి, మూడు, నాలుగు సెలైన్ బాటిళ్లను ఎక్కించారని ఆరోపించారు. తర్వాత ఇంటికి వచ్చిన బిక్షపతి.. ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో అదే రోజు రాత్రి కొంపల్లిలోని శిఖర ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి, బిక్షపతికి ఇచ్చిన మందులు, గోళీలు వికటించడం వల్లనే మరణించినట్టు వైద్యులు తెలిపారని బాధితులు తెలిపారు. శ్రీసాయి నర్సింగ్ హోమ్ నిర్వాహకులు మెరుగైన వైద్యం అందించి ఉంటే తమ తండ్రి బిక్షపతి మరణించేవాడు కాదని, సరియైన వైద్యం అందించకుండా తమ తండ్రి ప్రాణాలు తీశారని మృతుని కుమారులు బోయిని మహేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్, సురేష్ యాదవ్ ఆరోపించారు. మృతుని బంధువులు శ్రీసాయి నర్సింగ్ హోమ్, మందుల దుకాణానికి తాళం వేసి, సిబ్బందిని బయటకు పంపించి ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు.

సరైన వైద్యం అందించాం, తమ తప్పేమీ లేదు : ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ రాజు

ఈ విషయమై శ్రీసాయి నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ రాజు మాట్లాడుతూ.. బిక్షపతికి తమ ఆస్పత్రిలో సరియైన వైద్యం అందించాం.. అతని ఆరోగ్య పరిస్థితి బాగాలేదు హైదరాబాద్ సూపర్ స్పెషలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించినా, బిక్షపతి కుటుంబసభ్యులు పట్టించుకోకుండా ఇంటికే తీసుకెళ్లారు. సమయానికి ఆయన్ని పెద్దాస్పత్రికి తీసుకెళ్లి ఉంటే ప్రాణాలు పోయేవి కావు. ఇందులో తమ తప్పేమీ లేదు.

బ్యాంక్ అధికారుల బెదిరింపులు

- వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

బ్యాంకు అధికారుల బెదింపులు తళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కుమురం భీం జిల్లా సిర్పూర్(టి) మండలంలో జరిగింది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శివపూర్ గ్రామానికి చెందిన కారేం సంతోష్(33) కూలీ పని చేసుకుంటూ జీవించేవాడు. ఏడు సంవత్సరాల కిందట దుకాణం కోసం జిల్లా కో-ఆపరేటిట్ బ్యాంక్ సిర్పూర్(టి) శాఖలో రూ.30 వేల రుణం తీసుకున్నాడు. కొంత మేరకు కట్టిన తరువాత ఆర్థిక పరిస్థితులు సహకరించని కారణంగా కట్టలేదు. లోన్ డబ్బులు కట్టాలని బ్యాంకు వారు గతంలో నోటీసులు ఇచ్చారు. రుణం చెల్లించకపోవడంతో మంగళవారం ఉదయం సంతోష్ ఇంటికి బ్యాంకు అధికారులు వచ్చి రుణం కట్టాలని బెదిరించారు. దీంతో మనస్తాపానికి గురైన సంతోష్ మంగళవారం రాత్రి బయటకు వెళ్తున్నట్టు చెప్పి సమీపంలో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అతని భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు బ్యాంకు మేనేజర్‌తో పాటు సిబ్బందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కమలాకర్ తెలిపారు.

తెలుగు సాహిత్యాన్ని మరో మలుపు తిప్పిన శ్రీ శ్రీ

ప్రజాశక్తి కల్చరల్

అప్పటి వరకూ వున్న సంప్రదాయ కవిత్వ ధోరణుల కు భిన్నం గా తెలుగు సాహిత్యాన్ని మరో మలుపు తిప్పిన మహా కవి శ్రీశ్రీ అని రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు శ్రీ త్యాగరాయ గానసభ లోని లలిత కళా వేదిక పై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా మహా కవి శ్రీశ్రీ యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి మాట్లాడుతూ శ్రీశ్రీ సృష్టించిన కవితా ప్రభంజనం ఎందరినో తట్టి లేపిందని అన్నారు అయన రాసిన మహా ప్రస్థానం కావ్యం ప్రభావం నుంచి నేటికీ బయటకు వచ్చిన రచయితలు కవులు లేరని అంత బలమైన ముద్ర తెలుగు సాహిత్యం పై అయన కెవితలు వేశాయి అని వివరించారు కావ్య రచన లోనే కాకుండా సినీ పాటలలోనూ అవకాశం వున్న సందర్భాలలో సామ్యవాద అభ్యుదయ భావాలు జోడించారు అని తెలిపారు వంశీ రామ రాజు మాట్లాడుతూ శ్రీ శ్రీ విప్లవ కవి గా విరసం లో క్రియాశీలక పాత్ర పోషించారు అని గుర్తు చేశారు గాయకులు త్రినాథ రావు మాట్లాడుతూ శ్రీశ్రీ రాసిన సినీ గీతాలు స్థిరం గా తెలుగు సమాజం లో నిలిచి వుంటాయి అని అందుకు ' పాడవోయి భారతీయుడా," కల కానిది విలువైనది బ్రతుకు కన్నీటి ధారల లోనే బలి చేయకు ' ఉదాహరణ అని చెప్పారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై గాయని గరిమెళ్ల సీత గాన సభ పాలక వర్గ సభ్యుడు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.